క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



కడప కార్పొరేషన్ : సత్యశ్రీ చిట్స్ వారి ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను నగర మేయర్ సురేష్‌బాబు ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు సానపురెడ్డి శివకోటిరెడ్డి, మల్లికార్జున, ఎం.రామ లక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ వినోద్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కార్మిక పరిషత్ నాయకుడు పురుషోత్తం ఒక ప్రకటనలో కోరారు. దాదాపు 7 నెలల నుంచి కేంద్ర కార్యాలయం పదోన్నతుల పైన స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా మభ్యపెట్టడం తగదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వస్తుందనే ఉద్దేశంతో చాలా మంది ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని, ఇటువంటి తరుణంలో యాజమాన్యం సత్వరమే స్పందించాలని కోరారు.

సమ సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యం



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశంలో సమ సమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పులి కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్, అంబేద్కర్ నగర్‌లలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట శివ, భాగ్యలక్ష్మి, రాముడు, పుష్పవతి, సాలమ్మ, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రాక ముందే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్, నగర కమిటీ సభ్యురాలు జమీల పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని నకాష్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ తదితర బకాయిలు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అన్నదానం

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి తన కుమారుడు శివరామిరెడ్డి వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. స్థానిక స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ వద్ద గల తమ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 500 మందికి పైగా పేదలకు భోజన సౌకర్యం కల్పించారు. మురికి వాడల్లోని 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, పోతుల కుటుంబ సభ్యులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వల్లూరు బ్రహ్మయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌రెడ్డికి అభినందనలు



అనిల్‌కుమార్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న గ్రూప్–1 అధికారులు

కడప ఎడ్యుకేషన్ : ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం జిల్లాకు చెందిన పలువురు గ్రూప్–1 ఆఫీసర్స్ కడప కలెక్టరేట్‌లో కలిసి అభినందనలు తెలిపారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వై.ఓబులేసనందన్, జిల్లా ఉపాధి అధికారి సురేష్, జిల్లా సహాయ ఆడిట్ అధికారి శ్యామూల్ డెన్నీ, ఎంపీడీవో శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ట్రెజరీ సహాయ అధికారులు హరిత, దాదా కలందర్‌లు అనిల్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జాబ్‌మేళా

వేంపల్లె : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం బాలస్వామి తెలిపారు. ఈ జాబ్‌మేళకు 18 ఏళ్ల నుంచి 32 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలకు ఉచిత టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వడంతోపాటు రూ.8350ల జీతం ఇవ్వనున్నారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- 1950లోనే కడపలో తయారీ
- మార్కెట్‌లో పలు రకాలు అందుబాటులోకి..

క్యాలెండర్ కహానీ

కడప కల్చరల్ : కొత్త సంవత్సరానికి క్యాలెండర్ కాగితాల రెపరెపలు స్వాగతం పలుకుతున్నాయి. మార్కెట్‌లో పలు స్టేషనరీ దుకాణాల వద్ద దాదాపు 50 రకాల క్యాలెండర్లు దర్శనమిస్తున్నాయి. డిసెంబరు 15 నుంచి జనవరి చివరి వరకు క్యాలెండర్లకు సీజన్‌గా భావిస్తారు. కేవలం తేదీల క్యాలెండర్లే కాకుండా దేవతామూర్తులు, కనువిందైన ప్రకృతి చిత్రాలు తదితరాలతో రంగురంగుల క్యాలెండర్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. కొత్త సంవత్సరం మార్పునకు గుర్తుగా పలువురు ఇళ్లలో కొత్త క్యాలెండర్‌ను తెచ్చి పెట్టుకుంటారు. కొందరు బహుమతిగా బధుమిత్రులకు కూడా ఇస్తారు. 1950లోనే కడపలో పంచాంగ కర్తలు క్యాలెండర్లను రూపొందించడం విశేషం.

మార్కెట్‌లో పోటీ

మిగతా అన్ని వ్యాపారాల్లో లాగానే క్యాలెండర్ల రంగంలో కూడా భారీ పోటీ ఉంది. డిమాండ్‌ను ఊహించిన ప్రచురణ కర్తలు వీలైనంత వరకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల పలు రకాల క్యాలెండర్లు మార్కెట్లలో కనిపిస్తున్నాయి. ఇంత వరకు నెలలు, తేదీలకు పరిమితమైన క్యాలెండర్లు ప్రస్తుతం రకరకాల మార్పులను సంతరించుకున్నాయి. దాదాపు 50 రకాల క్యాలెండర్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సాధారణ క్యాలెండర్లే కాకుండా రంగురంగుల మల్టీకలర్, ఆయిల్ బోర్డు పేపర్‌తో అత్యంత ఆకర్షణీయంగా రూపుదిద్దుతున్నారు.

క్యాలెండర్ల వెనుక గల పేజీల్లో వాస్తు, పంచాంగం తదితర సమాచారాన్ని అందిస్తున్నారు.



వివిధ కంపెనీలకు చెందిన క్యాలెండర్లు

మహిళలను ఆకట్టుకునేందుకు బ్యూటీ టిప్స్, వంటల తయారీ, మెహందీ డిజైన్లు, వంటింటి చిట్కాలు, పుణ్యక్షేత్రాల వివరాలు అందిస్తున్నారు. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లలో తేదీలు చూసుకునే సౌకర్యం ఉన్నా.. ఇంటిలో ఒక క్యాలెండర్ అయినా అందుబాటులో ఉంచడం పరిపాటి.

ఆకర్షణీయంగా..

ఇటీవల నూతన సంవత్సర క్యాలెండర్ల రంగంలో ప్రస్తుతం విపరీతమైన పోటీ నెలకొంది. ప్రముఖ పంచాంగకర్తల క్యాలెండర్లకు మంచి గిరాకీ ఉంటోంది. ముఖ్యంగా బుట్టి, తంగిరాల, పిడపర్తి, ములుగు తదితర పంచాంగకర్తలు రూపొందించిన క్యాలెండర్లు విపరీతమైన ప్రచారంతో విడుదలవుతున్నాయి. టీటీడీ ఈ సందర్భంగా నాలుగు రకాల క్యాలెండర్లను ప్రచురిస్తూ దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తోంది. క్యాలెండర్లను రూపొందించే సిద్ధాంత కర్తల్లో పలువురికి రాష్ట్ర ఆస్థాన పంచాంగ కర్తలుగా ప్రభుత్వాలు పట్టం కట్టడం విశేషం.

తొలి ఘనత మనదే!

ఎన్నో అంశాలలో ప్రథమస్థానంలో నిలిచిన మన జిల్లా క్యాలెండర్ల విషయంలో అదే స్థాయి ఘనత సాధించింది. మన జిల్లాలో తొలిసారిగా 1950లో రాయల్ అండ్‌కో వారు క్యాలెండర్లను రూపొందించి విక్రయించినట్లు తెలుస్తోంది. వారి దుకాణం కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో ఉండేది. దుకాణ యజమాని జక్కా సుబ్బరాయులుశ్రేష్ఠి ఈ క్యాలెండర్లను రూపొందించేవారు. ఆ క్యాలెండర్ల సైజు, పేపరు కూడా ప్రత్యేకంగా ఉండడంతో ఆ పేపర్లకు రాయల్ సైజ్ పేపర్లుగా పేరు వచ్చింది. మొన్నటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సాధించిన రాయల్ పెద్దబాలశిక్ష, రాయల్ అట్లాస్ కూడా ఆ కంపెనీ వారు రూపొందించినవే కావడం విశేషం. మద్రాసుకు చెందిన గోపాల్ అండ్ కో, వెంకట్రామ్ అండ్‌కో కడపలో కూడా తమ శాఖలను విస్తరించి క్యాలెండర్లు విక్రయించి పేరు సాధించాయి. 1952 నుంచి కడప నగరం వైవీ స్ట్రీట్‌లో పలు దుకాణాలలో క్యాలెండర్లను విక్రయించడం మొదలు పెట్టారు.

10 పైసల నుంచి రూ.500 వరకు

తొలుత అందుబాటులోకి వచ్చినపుడు క్యాలెండర్ ధర కడపలో 10 పైసలుగా విక్రయించినట్లు సమాచారం. ప్యాకెట్ డైరీ లాంటి క్యాలెండర్ నుంచి సంప్రదాయ సైజు, ఆకర్షణీయమైన చిత్రాలు, టేబుల్ క్యాలెండర్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. కాలక్రమంలో వీటి ధర పెరుగుతూ రూ.15–500 వరకు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించాలి



రాష్ట్ర అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మైనార్టీ సంక్షేమ శాఖ విభాగ సీఈడీఎం ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించాలని రూట వ్యవస్థాపకుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కడపలోని తమ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల సన్నద్ధం కోసం స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగ పడుతుందని, వీలైనంత త్వరగా అందించాలని కోరారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం సంబంధిత రాష్ట్ర అధికారులకు ఫోన్ చేసి స్టడీ మెటీరియల్ ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. వారంలోపు పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూట రాష్ట్ర నాయకులు షాహిదుల్లా, మహమ్మద్ అయ్యూబ్, సయ్యద్ సిరాజుద్దీన్, అఫ్జల్ బాషా, పక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని సమర్థించే బలిజ నాయకులు

వాస్తవాలు తెలుసుకోవాలి

వైఎస్సార్‌సీపీ బలిజ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బలిజ నాయకులు

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీని సమర్థించే బలిజ నాయకులు వాస్తవాలు తెలుసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలిజ నాయకులు తోటక్రిష్ణ, ఎస్‌పీ రాము, పత్తి రాజేశ్వరి, సుదర్శన్ రాయల్ అన్నారు. శుక్రవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బలిజలను ఒక కులానికి, ఒక పార్టీకి అంటగట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వాస్తవాలు మాట్లాడుతుంటే నాలుకలు కోస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. టీడీపీలో ఎంతోమంది బలిజలను తొక్కేసిన చరిత్ర ఉందని, మాజీ మంత్రి బ్రహ్మయ్య దగ్గర నుంచి కడప టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దుర్గాప్రసాద్ వరకు ప్రతి ఒక్కరూ అణచివేతకు గురయ్యారని గుర్తు చేశారు. చివరికి హరిప్రసాద్ సైతం టీడీపీ చేస్తున్న కుటిల రాజకీయాల్లో బలయ్యారనేది నిజమా, కాదా స్పష్టం చేయాలన్నారు. బలిజలకు సీటు తెచ్చుకోలేని టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారంటూ మండిపడ్డారు. 2014లో టీడీపీ తరఫున బలిజ నాయకుడు దుర్గాప్రసాద్ పోటీ చేస్తే హీనంగా ఓటమి పాలు చేశారన్నారు. ఇందులో హరిప్రసాద్ పాత్ర ఉందా లేదా అంటూ ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ తరఫున నిలబడే ఏ అభ్యర్థికైనా బలిజ కులస్తులు మద్దతుగా ఉండి గెలిపిస్తారని స్పష్టం చేశారు. బలిజలకు వైఎస్ఆర్‌సీపీ ఏం చేసిందో, టీడీపీ ఏం చేసిందో చర్చించేందుకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించేందుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు శివకేశవ, వెంకట సుబ్బయ్య, రెడ్డి ప్రసాద్, వెంకటేష్, బండి బాబు, మల్లేశ్వరి, ఉమామహేశ్వరి, శంకరాపురం సింధు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె : మండలంలోని వెల్దుర్తి గ్రామంలో బుధవారం ప్రారంభమైన చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ముగిసాయి. మూడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల్లో గ్రామంలోని మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి చింత కొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులల్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పులివెందుల టౌన్ : పట్టణంలోని జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులతోపాటు పలు అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. వీలైనంత త్వరగా అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

నూతన భవనాలలో విధులు ప్రారంభం

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాలను ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నూతన భవనాలలో శుక్రవారం తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, పోలీస్‌స్టేషన్‌లో పులివెందుల రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ రోషన్, ఆయా అధికారులు నూతన భవనాలలో ప్రత్యేక పూజలు చేసి విధులు నిర్వహించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సింహాద్రిపురం మండల అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చెన్నూరు : స్థానిక ఎరువుల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు బద్వేల్ వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆకస్మిక తనిఖీ చేసి పలు రిజిస్టర్ లను, రశీదులను పరిశీలించారు. అనంతరం ఆయన దుకాణ యజమానులతో మాట్లాడుతూ ఇన్వాయిస్, బస్తా తూకం, లైసెన్స్ గడువు వంటి అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని రైతు సంతకం, మొబైల్ నంబర్ తప్పక సేకరించాలన్నారు. నాణ్యమైన ఎరువులను మాత్రమే అమ్మాలని తడిసిన, గడ్డకట్టిన ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదన్నారు. కొనుగోలు సమయంలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల నియంత్రణ చట్టం–1985 నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలన్నారు. తనిఖీలో మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, రైతు భరోసా కేంద్ర సహాయకులు చరణ్ పాల్గొన్నారు.

నేషనల్ హైవే బాధితులకు న్యాయం చేస్తాం

చెన్నూరు : కడప–కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు కొత్త రోడ్డు వద్ద జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని, వారికి త్వరలోనే ఇంటి పట్టాలు అందజేస్తామని ఆర్డీఓ జీఆర్ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆయన కనపర్తి గ్రామ పొలాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ బాధితులకు సంబంధించిన సమస్యలను అలాగే జాతీయ రహదారిలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనుల గురించి ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. కాగా ఈ విషయాలపై ఆర్డీఓ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులు 256 మంది ఉండగా, స్థానికంగా 76 మంది లేరని మిగిలిన 180 మందికి ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. వీరికి ఇచ్చే స్థలాలు ఎగువ ప్రాంతంగా ఉండి ఇంటికి అనువుగా ఉండే విధంగా స్థలాలు కేటాయించామన్నారు. అంతేకాకుండా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెండింగ్‌లో ఉన్న సర్వీసు రోడ్లు, డ్రైనేజీ పనులు, అలాగే బస్ షెల్టర్ అన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులు తొందరగా జరిగే విధంగా చూస్తామన్నారు.

పత్రికల పతనం.. విజ్ఞానానికి దోహదం



తిరుగుబాటు మాసపత్రిక విడుదల చేస్తున్న విద్యాశాఖ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : పత్రికల పఠనం విజ్ఞానానికి దోహద పడుతుందని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం సంయుక్తంగా ముద్రించిన తిరుగుబాటు మాసపత్రికను శుక్రవారం కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, డిప్యూటీ డీఈఓలు రాజగోపాల్‌రెడ్డి, క్రిష్ణప్పలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ మాట్లాడుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ సంయుక్తంగా 1984 నుంచి ఈ పత్రికను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ పత్రికలో ప్రధానంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, సామాజిక వేత్తలు, లౌకిక ప్రజాస్వామ్యవాదులు వారి ఆలోచనలతో వ్యాసాలు రాయడం జరిగిందన్నారు. విద్యార్థులు, యువతకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంఈఓ పాలెం నారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్, నగర కార్యదర్శి గణేష్, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు శంకర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులరెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సేవలు ప్రశంసనీయం




క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం, యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో యూటీఎఫ్ స్టిక్కర్, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగ సంక్షేమం కోసం యూటీఎఫ్ కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, తేజేస్ అహ్మద్, నాయకులు మస్తాన్‌బాషా, జావీద్, బాబు, కరీముల్లా, మహబూబ్‌ఖాన్, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు అలవాటు చేసుకోరాదు

ప్రొద్దుటూరు కల్చరల్ : మత్తు పదార్థాలను అలవాటు చేసుకుని జీవితాన్ని పాడు చేసుకోరాదని త్రీటౌన్ సీఐ కె.వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ యోగివేమన యూనివర్సిటీ కళాశాలలో శుక్రవారం ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా రూపొందించిన ఉద్యమ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలను అలవాటు చేసుకుని యువత పెడదోవ పడుతోందన్నారు. దీనివల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వీటికి దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలిచి సమాజ సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రమణయ్య, జమాతే ఇస్లామి హింద్ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ మోహిద్దీన్, ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ జబివుల్లా, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ మోహిత్, సభ్యులు పాల్గొన్నారు.

నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా రసూల్



పులివెందుల రూరల్ : నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా రసూల్‌ను నియమించారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో నూర్‌బాషా దూదేకుల సంఘాన్ని బలోపేతం చేసే విధంగా తన వంతు సహాయ సహ కారాలు అందిస్తానన్నారు. అలాగే 2024 ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అత్యధిక సీట్లు వచ్చే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నూర్‌బాషా దూదేకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న విద్యార్థులు, కాలనీ వాసులు

కడప ఎడ్యుకేషన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజారావు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా రెండవ రోజు సింగపూర్ టౌన్‌షిప్‌లో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు వాతావరణ కాలుష్యంతో వర్షాలు సకాలంలో కురవడం లేదన్నారు. దీని నివారణకు ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ టౌన్‌షిప్ ప్రెసిడెంట్ బండి రాఘవరెడ్డి, సెక్రటరీ మల్లికార్జున రెడ్డి, పదవీ విరమణ అధ్యాపకుడు ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ తులసి నాగప్రసాద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా యువత తమ మోటార్ బైకులతో విన్యాసాలు చేసి ఇతరులకు ఇబ్బందులు సృష్టించకుండా ఉండడంతోపాటు ప్రమాదాలకు గురికాకుండా సంతోషంగా నిర్వహించుకోవాలని చిన్నచౌక్ ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. స్థానిక రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు కరీముల్లా ముద్రించిన ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, చిన్నచౌక్ ఎస్ఐ తులసి నాగేంద్ర ప్రసాద్‌లచే ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

వైవీయూ : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఈఎంఓ డి.రమణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం –1994'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 3 నుంచి 5 ఏళ్ల జైలుశిక్ష, రూ.50 వేల జరిమానా ఉంటుందని తెలిపారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమలో వైస్ ప్రిన్సిపాల్ పి.గురివిరెడ్డి, పారాలీగల్ వలంటీర్ వరకుమార్, సఖి వన్‌స్టాప్ సెంటర్ సైకాలజీ నిపుణులు సునీత, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు బోర్లాపడుకొని నమస్కారాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణుప్రీతమ్ రెడ్డి, కాంగ్రెస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లయ్య మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుంకరి రవి, కిరణ్, గోపి, తిరుపాల్, నాగరాజు, ఆనంద్, కిరణ్ కుమార్, వి.శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పిద్దాం



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ వీరారెడ్డి

వల్లూరు : ప్రజా వైద్యానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం ఉచితంగా వైద్య సేవలను అందించడానికి చర్యలు చేపట్టిందని మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు మండలంలో రబీ పంటగా మినుము పంటను అధికంగా సాగు చేశారని, వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకోవడానికి అధికారులు కృషి చేయాలని అన్నారు. ఆయన సూచన మేరకు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎంపీడీవో జయశ్రీ మాట్లాడుతూ జనవరి 18వ తేదీ నుండి మండలంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర జరుగుతుందని, గ్రామస్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం ద్వారా ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని అన్నారు. తహసీల్దార్ శంకర్‌రావు మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ జరిగితే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరిగే విధంగా ప్రభుత్వం ఆటో మ్యుటేషన్ పద్ధతిని అమలులోకి తీసుకురావడం సుభ పరిణామమని, దీని వలన కొత్తగా భూములు కొన్నవారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. దీని కింద ఇప్పటికే మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో ఒక మ్యుటేషన్ జరిగిందని తెలపారు. జగనన్న భూ హక్కు – భూ రక్ష కార్యక్రమం కింద గ్రామాల్లోని స్థలాల రీసర్వే జరుగుతోందని ఈవోపీఆర్డీ ప్రసాద్ తెలిపారు. అనంతరం పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐదుగురిపై బైండోవర్

జమ్మలమడుగు రూరల్ : మండలంలో శుక్రవారం ఐదుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ గురప్ప ఎదుట హాజరు పరచినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. గతంలో వీరిపై పలు కేసులు ఉండటం వల్ల వీరిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.